నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 23 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## నేడు ప్రజావాణి

సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ఏడు మండలాల ప్రజల సౌకర్యార్థం కాగజ్‌నగర్‌లో ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ ● ఆసిఫాబాద్ సబ్ జైలులో అవగాహన సదస్సు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 22 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆసిఫాబాద్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైలులో 'ధ్యానంతో ఆరోగ్యవంతమైన జీవితం' అనే అంశంపై ఆదివారం రెండో రోజూ నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. తెలిసో.. తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారికి ఆర్థిక స్థోమత లేకుంటే న్యాయ సేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అదనపు జడ్జి యువరాజు, జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, బ్రహ్మకుమారి రాణి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, అంజలీదేవి, జైలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంవీ రమేశ్

# ఆయిల్‌పాం విస్తరణ ఆగినట్లేనా!?

**1048 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యం**

● గడువు ముగిసి నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
● ప్రస్తుతం 129 ఎకరాలతోనే సరి ● రైతుల్లో సన్నగిల్లుతున్న ఆశలు
● కేసీఆర్ సర్కారులో అన్ని విధాలా ప్రోత్సాహం

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆయిల్‌పాంల విస్తరణ ఆగిపోయినట్లే కనిపిస్తున్నది. శాసనసభ ఎన్నికల తర్వాత అధికారులు ఆ వైపు దృష్టి సారించకపోవడంతో తోటల సాగు సందిగ్ధంలో పడింది. ఈ ఏడాది మార్చి నాటికే 1048 ఎకరాల్లో తోటలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అది నెరవేరలేదు. ప్రస్తుతం 23 మంది రైతులు 129 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తుండగా, ఇక అక్కడితోనే బ్రేక్ పడేలా ఉంది. అధికారులు తోటలను విస్తరించే దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతాంగం నిరుత్సాహానికి గురవుతున్నది.

### కేసీఆర్ సర్కారులో ప్రోత్సాహం

రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేందుకు కేసీఆర్ సర్కారు జిల్లాలో ఆయిల్‌పాం తోటల పెంపకాన్ని ప్రోత్సహించింది. రైతులను నష్టాలు లేని సాగువైపు మళ్లించేందుకు ఆయిల్ పాంలను పెద్ద మొత్తంలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంది. మ్యాట్రిక్స్ అనే ప్రైవేట్ కంపెనీకి బాధ్యతలు అప్పగించడంతోపాటు మొక్కల సరఫరాలో రైతులకు సబ్సిడీని అందించింది. ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు మొక్కలను సరఫరా చేసేందుకు మంచిర్యాల జిల్లాలోని భీమారంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటు చేశారు. ఒక్కో మొక్క ఖరీదు రూ. 213 ఉండగా, రూ. 193 సబ్సిడీ అందించారు. అంతేకాకుండా ఆసక్తి ఉన్న రైతులకు రూ. లక్ష విలువగల డ్రిప్‌లను అందజేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో ఇవ్వగా, మిగతా రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్‌లను అందజేసి ప్రోత్సహించారు. దీంతో రైతులు ఆయిల్‌పాం సాగుకు ముందుకు వచ్చారు. రైతులు మొక్కలు నాటిన నాలుగో యేట నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఏటా దిగుబడి పెరుగుతూ వస్తుంది. దాదాపు ఏళ్ల పాటు రైతులకు ఆదాయం వస్తూనే ఉంటుంది. రైతులకు ఆర్థికంగా ఇంతలా ఉపయోగపడే పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఆయిల్‌పాం తోటల ఏర్పాటుపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

### సాగుకు బ్రేక్!

మార్కెట్‌లో ఆయిల్ పాంకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు చేపట్టిన ప్రాథమిక సర్వేల ప్రకారం జిల్లాలో సుమారు 3 వేల ఎకరాలు ఆయిల్ పాం సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా జిల్లాలో 1048 ఎకరాల్లో తోటలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విడుతల వారీగా ఆయిల్ పాం తోటలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఇప్పటికే 129 ఎకరాల్లో విస్తరించారు. మార్చిలోగా టార్గెట్ పూర్తిచేసేందుకు రైతులకు అవగాహన కల్పించి భూములను సిద్ధం చేసినప్పటికీ, కొత్త ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఆయిల్‌పాం సాగుకు బ్రేక్ పడినట్లు అయ్యింది.

# అమ్మో.. హస్తం లీడర్లు

**చెన్నూర్‌లో పెచ్చుమీరిపోతున్న కాంగ్రెస్ నాయకుల ఆగడాలు**

● తప్పుడు దరఖాస్తుపై సంతకం పెట్టాలని పంచాయతీ సెక్రటరీపై ఒత్తిడి
● అందరి ముందే అసభ్య ప్రవర్తన
● వారం క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కార్యదర్శి ● ఆపై కేసు వాపస్
● కొందరి తీరుతో పార్టీకి చెడ్డపేరు వస్తుందంటున్న శ్రేణులు



చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 22 : చెన్నూర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఇసుక.. రేషన్ బియ్యం అక్రమ రవాణా.. చెరువుల కబ్జా.. ఇలా ఏ దందాలో చూసినా వారి 'హస్తం'ఉంటుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇల్లీగల్ దందా లేకాక అధికారులను సైతం వేధింపులను గుర్తి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పొన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శిని, అదే గ్రామానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ లీడర్లు తప్పుడు దరఖాస్తుపై సంతకం చేయాలంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిసింది. ఆమెతో అసభ్యకంగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించినట్లు ఆ ఊరి ప్రజలు చెబుతున్నారు. 2022లో పొన్నారం గ్రామానికి చెందిన బాలికకు, కోటపల్లి మండలం దేవులవాడ గ్రామానికి చెందిన ఓ యువకుడికి ప్రేమ వివాహమైంది. ఆ సమయంలో సదరు బాలిక మైనర్ కావడంతో కల్యాణ లక్ష్మి పథకానికి అనర్హురాలైంది. ఇటీవల మేజర్ కావడంతో కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నది. దీంతో స్థానిక కార్యదర్శి గ్రామంలో విచారణ చేపట్టారు. కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకున్న యువతికి రెండేళ్ల క్రితమే వివాహమైందని, ఏడాదిన్నర బాబు సైతం ఉన్నాడని విచారణలో తేలింది. దీంతో దరఖాస్తుపై పంచాయతీ కార్యదర్శి సంతకం చేయలేదు. ఈ విషయం తెలుసుకున్న హస్తం పార్టీ లీడర్లు అప్లికేషన్ మీద సంతకం చేయాలంటూ ఆమెపై ఒత్తిడి తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకం చేయనని ఆమె తేల్చి చెప్పడంతో నాయకులు అందరి ముందే అసభ్యంగా మాట్లాడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి చెన్నూర్ ఎంపీడీవో, ఎంపీవో దృష్టికి తీసుకెళ్లింది. వారి సూచన మేరకు వారం క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వారం రోజుల్లో ఏం జరిగిందో తెలియదు కానీ.. శనివారం పంచాయతీ సెక్రటరీ వచ్చి కేసు వాపస్ తీసుకుందని చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు. హస్తం పార్టీ లీడర్ల తీరుపై చెన్నూర్ జనాలు మండిపడుతున్నారు. కనీసం మహిళ అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఎమ్మెల్యే గడ్డం వివేక్ సదరు నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు లీడర్లు అక్రమ దందాలు చేస్తూ, అధికారులను వేధిస్తూ పార్టీకి చెడ్డపేరు తీసుకువస్తున్నారని ఆ పార్టీ నాయకులే మండిపడుతున్నారు. ఎమ్మెల్యే స్థానికంగా అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని, ఎవరికీ భయం లేకుండా పోతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 22 : ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే రేషన్ డీలర్ల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపల్కుల సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు జిల్లాలోని 426 మంది రేషన్ డీలర్లు తరలిరావాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్ డీలర్లకు రూ. 5 వేల వేతనం పెంచాలని, రూ. 300 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాజన్న, డీలర్లు గంగారాజం, రామస్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సత్తయ్య

## సమస్యల పరిష్కారానికి కృషి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో పీఆర్టీయూ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిపి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.

### పీఆర్టీయూ నూతన కమిటీ

పీఆర్టీయూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏటూకూరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా అనిల్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా ఎన్ చారి, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా గంగాభవాని, మహిళా కార్యదర్శిగా సుజాత, జిల్లా సభ్యులుగా సమత, సాంబశివరావు, భరత్, దామోదర్, సంతోష్‌ను ఎన్నుకున్నారు.

పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

రామకృష్ణాపూర్‌లోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

# కలుసుకొని.. జ్ఞాపకాలు నెమరేసుకొని

### ఆర్కేపీ, కౌటాలలో అపూర్వ సమ్మేళనాలు

మందమర్రి, సెప్టెంబర్ 22 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపైకి చేరి సందడి చేశారు. తీపి జ్ఞాపకాలను నెమరేసుకొని మురిసిపోయారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు రఘునాథరావు, ఉపాధ్యాయులు రమాదేవి, సురేందర్, రాజన్న, రాజు, రాజమణి, పూదరి సత్యనారాయణ, శ్రీరామ్‌నర్సయ్య, సురేశ్, పీఈటీ రవిని ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు.

### 11 ఏళ్ల తర్వాత..

కౌటాల, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలోని మయూరి విద్యాలయంలో 2012-13 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను పంచుకొని ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శాగంటి యాదగిరితో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు. మెమొంటోలతో సత్కరించారు.

కౌటాల : మయూరి స్కూల్ 2012-13 పదోతరగతి విద్యార్థులు

2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

## 24 ఏళ్ల తర్వాత

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 22 : పట్టణంలోని శ్రీరాఘవేంద్ర హైస్కూల్‌లో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అందుగులపేట సమీపంలోని ఓ ఫాంహౌజ్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారిక జ్ఞాపికలు అందజేశారు.

## కుక్కల దాడిలో తొమ్మిది మందికి గాయాలు

రెబ్బెన, సెప్టెంబర్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కుక్కలు దాడి చేయడంతో దాదాపు తొమ్మిది మంది గాయపడ్డారు. గోలేటి, పులికుంట, నంబాల, ఖైర్‌గూడ గ్రామాల్లో తొమ్మిది మందిపై కుక్కలు దాడి చేయగా, రెబ్బెన పీహెచ్‌సీలో చికిత్స పొందారు. పీహెచ్‌సీలో కుక్క కాటుకు సరిపడా మందులున్నాయని డాక్టర్ సుజిత్ తెలిపారు. కాగా, కుక్కల బెడద నుంచి తమ ను కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలి

● క్రీడలతో ఉద్యోగుల్లో స్నేహభావం పెరుగుతుంది ● చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్
● కాళేశ్వరం జోన్ స్పోర్ట్స్ మీట్ ముగింపు ● విజేతలకు బహుమతుల ప్రదానం

మంచిర్యాల క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 22 : క్రీడాకారులు పట్టుదలతో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని కాళేశ్వరం జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జిల్లా అటవీ శాఖ (డీఎఫ్‌వో) శివ్‌ఆశీశ్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళేశ్వరం జోన్ అటవీ శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ ముగిసింది. ఆయన మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని, క్రీడల్లో పాల్గొనడం వల్ల స్నేహ భావం పెరుగుతుందన్నారు. అక్టోబర్ 5, 6న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే యేడాది ములుగు జిల్లా కేంద్రంలో 340 మంది ఉద్యోగులకు అథ్లెటిక్స్, కల్చరల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కన్జర్వేటర్ ఫారెస్ట్ (ఎఫ్‌డీపీటీ కేటీఆర్) ఐఎఫ్ఎస్ ఎస్ శాంతారామ్‌తో కలిసి చాంపియన్‌గా నిలిచిన మంచిర్యాల క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్ తాబేరివల్, ములుగు డీఎఫ్‌వో వసంత, పెద్దపల్లి డీఎఫ్‌వో శివయ్య, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో శుశాంత్ సింగ్, మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్, మంచిర్యాల ఎఫ్‌డీవో టీవీ బాపు, ఎఫ్ఆర్వోలు జీ రత్నాకర్‌రావు, సుభాష్, పూర్ణచందర్, సదానందం, అప్పలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## చారిగాంలో దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : మండలంలోని చారిగాం గ్రామంలో ఆదివారం దాడులు నిర్వహించి దేశీదారును పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. చారిగాం గ్రామంలోని ఓ పాడుబడ్డ ఇంటిని కేంద్రంగా చేసుకొని దేశీదారు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందగా తనిఖీలు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మహేశ్, మహారాష్ట్రలోని బల్లార్షకు చెందిన రితీక్‌రాజు, సంతోష్ దేవాజీని అరెస్టు చేశారు. రూ.55 వేల విలువగల 15 కాటన్ల (1500 వందల 90 ఎంల్ బాటిల్స్) దేశీదారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్ ఉన్నారు.

దేశీదారును పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూర్తి మహోత్సవం
మరియు
● అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679